క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో మలేరియా నివారణకు ఉదయం, మధ్యాహ్న సమయాల్లో ఫాగింగ్ నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4వ తేదీ వరకూ దశలవారీగా అన్ని డివిజన్లలో ఫాగింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర పరిధిలోని 50 డివిజన్లలో ఫాగింగ్ నిర్వహించనున్నామని, రాత్రిపూట ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి డివిజన్‌కు షెడ్యూల్ ప్రకారం నిర్దిష్ట సంఖ్యలో ఫాగింగ్ వాహనాలు కేటాయించడం జరిగిందని, ఒక రిజర్వు వాహనం ద్వారా అత్యవసర ఫిర్యాదులు, ప్రజా సేవా ప్రదేశాల్లో ఫాగింగ్ చేస్తామన్నారు. ఈ నెల 22వ తేది నుంచి 25 వరకూ, 29 తేదీలు సెలవు దినాలుగా ప్రకటించారు. ప్రజలు నగరపాలక సిబ్బందికి సహకరించాలని కోరారు. దోమల నియంత్రణకు సంబంధించిన ఫిర్యాదులు లేదా ప్రత్యేక అభ్యర్థనల కోసం కడప మున్సిపల్ కార్పొరేషన్ హెల్ప్‌లైన్ 9949093772 ను సంప్రదించవచ్చని తెలిపారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి నిర్ణయం హర్షణీయం

కడప స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం పాఠశాలలకు క్రీడాసామగ్రిని అందించేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని వైఎస్ఆర్ కడప జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలకు రూ.7వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.14 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.30 వేల వరకు విలువ చేసే క్రీడాసామగ్రి అందించేలా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

లింగమూర్తి సేవలు మరువలేనివి



కమ్యూనిస్ట్ నేత లింగమూర్తి స్తూపం వద్ద ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ లింగమూర్తి సేవలు మరువలేనివని, ఆయన స్మారక స్తూపం ఆవిష్కరణ ఈనెల 28న నిర్వహించనున్నామని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లి రైల్వే వంతెన సమీపంలోని విశ్వనాథపురం హిందూ స్మశాన వాటికలో జరుగుతున్న లింగమూర్తి స్తూపం పనులను ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్ రెడ్డి తన ప్రతినిధుల బృందంతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, డీజీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటేశు, రైతు నాయకులు మునిరెడ్డి, ఆర్టీయూ నాయకులు గంగన్న, విజయ్ కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని పాస్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఎన్జీవో కాలనీ లో ఉన్న ఐక్య ఆరాధన ప్రార్థనా మందిరంలో కిపివా, ఐఎఫ్‌సీఎం సంస్థ గౌరవ అధ్యక్షులు ఎం.విక్టర్ పాల్, బిషప్ డానియల్, ఎన్.అజరయ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీ బిషప్ కౌన్సిల్ నేత యలమంచిలి ప్రవీణ్, జీసస్ క్రైస్ట్ చర్చి బిషప్ డాక్టర్ కె.శామ్యూల్ బాబు, ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్, సెక్రటరీ బిషప్ రాజ్ కుమార్, పాలగిరి జాన్సన్, పాస్టర్ దాసరి సుధాకర్, పాస్టర్ మహేష్ బ్రదర్ ఎస్.దాసు, రవితేజ, విజయ శేఖర్, పాస్టర్ కె ఫిలిప్, అమీర్‌బాబు, బండి జకరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఎన్జీఓ కాలనీలోని ఎక్యూమినికల్ ఎవాంజికల్ చర్చి ప్రతినిధులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కూడా ఎమ్మెల్యే ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి దుప్పట్లు పంపిణీ చేశారు.

నేడు ప్రసంగం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఓం శాంతి సంస్థకు చెందిన ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌ఛార్జి రాజయోగిని బీకే గీతా బెహన్ ఆధ్వర్యంలో ప్రసంగాలు ఉంటాయని ఓం శాంతి సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఒత్తిడి లేని జీవిత ప్రయాణం అనే అంశంపై విశాఖకు చెందిన బీకే శివలీల అక్కయ్య డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు.

సీఎస్ఐ సెంట్రల్ చర్చి

పరిశుద్ధ ప్రార్థనా మందిరం



కడపలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చి

కడప కల్చరల్ : కడప నగరంలో విశిష్ట ప్రార్థనా మందిరంగా క్రైస్తవుల ప్రార్థనలకు ఆలవాలంగా నిలుస్తున్న పరిశుద్ధ ప్రార్థనాలయం సీఎస్ఐ సెంట్రల్ చర్చి. క్రిస్మస్ నేపథ్యంలో ఈ ప్రార్థనా గోపురం గురించి సాక్షి ప్రత్యేక కథనం.

● ఎందరో విశ్వాసుల ప్రార్థనా నిలయంగా, పరిశుద్ధాత్మతో ప్రార్థించిన హృదయాలకు శాంతి, సమాధానాలను అందిస్తున్న కేంద్రంగా జిల్లాలో ప్రముఖ క్రైస్తవాలయంగా కడప నగరానికి ఆధ్యాత్మిక ఆకర్షణ క్షేత్రంగా విలసిల్లుతున్నది సీఎస్ఐ సెంట్రల్ చర్చి. ఆంగ్లేయులు ఈ దేశాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో లండన్‌లో ×లండన్ మిషన్× పేరిట ఆధ్యాత్మిక సంస్థను ఏర్పాటు చేశారు. 1822 ప్రాంతంలో రెవరెండ్ విలియమ్ హ్యావెల్ ద్వారా పరిశుద్ధ వాక్య పరిచర్యల బృందాలు మన జిల్లాకు చేరాయి. ఆయన ఆధ్వర్యంలో క్రైస్తవ మతం ఈ జిల్లాలో విస్తరించింది. విద్య, వైద్య సేవల ద్వారా సామాజిక గౌరవాన్ని సాధించిన లండన్ మిషనరీలు కడప నగరంలోని మారుమూల గ్రామాలలో కూడా విద్యాభివృద్ధి జరగాలని కడప నగరంలో ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. 1878లో లండన్ మిషన్ ఉపాధ్యాయ శిక్షణా సంస్థతోపాటు బోర్డింగ్ పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణంలోని పెద్ద హాలును ప్రార్థనా మందిరంగా ఉపయోగించేవారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆ స్ఫూర్తితో లండన్ మిషన్, 1947 సెప్టెంబరు 27న చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ)గా మారింది. ఈ ప్రాంతంలో మొదటి బిషప్ డోర్నకల్ అజరయ్య కూడా ఇందుకు తమవంతుగా సహకారం అందేశారు. అప్పటి నుంచి 2000 సంవత్సరం వరకు పాఠశాల ఆవరణంలోని మందిరంలోనే ప్రార్థనలు నిర్వహించేవారు. 1878లో సీఎస్ఐ పరిధిలో ఉండిన క్రైస్తవ కుటుంబాలు రెండు వేల సంవత్సరం నాటికి బాగా పెరగడంతో వారి ప్రార్థనల కోసం పెద్ద ప్రార్థనా మందిరం అవసరం ఏర్పడింది. ఫలితంగా సీఎస్ఐ ఆవరణలోనే నూతన చర్చి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. క్రైస్తవ లోకం సహకారంతో సీఎస్ఐ సెంట్రల్ చర్చి పేరిట నూతన ప్రార్థన మందిరం రూపుదిద్దుకున్నది. సువిశాలమైన మైదానంలో ఎంతో గంభీరంగా, చూడగానే పవిత్రమైన భావన కలిగించేలా రూపుదిద్దుకున్న సుందరమైన భవనమే సీఎస్ఐ సెంట్రల్ చర్చి. పటిష్టమైన, సంప్రదాయ నిర్మాణ రీతిలో అత్యాధునిక వసతులతో నిర్మాణమైన ఈ చర్చిలో ఒకేసారి 2 వేల మందికి పైగా ప్రార్థనలు నిర్వహించుకోవచ్చు. భక్తులకు ఎదురుగా గురువులు సందేశాలు ఇచ్చేందుకు ఎత్తయిన వేదికను ఏర్పాటు చేశారు. వేదిక ఎదురుగా మరోవైపు భక్తుల కోసం చిన్న బాల్కనీనికూడా నిర్మించారు. భక్తులు అక్కడి నుంచి కూడా ప్రార్థనల్లో పాల్గొనేలా దాన్ని తీర్చిదిద్దారు. ఈ విశాలమైన ప్రార్థనా మందిరం సీఎస్ఐ డయాసిస్ పరిధిలోని విశ్వాసుల ఆధ్యాత్మిక నిలయంగా విలసిల్లుతోంది. యేటా క్రిస్మస్ పండుగను ఈ క్షేత్రంలో ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. పండుగకు ముందు క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తారు. అనంతరం జనవరి 1వ తేదీ వరకు చర్చి సభ్యులకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: పెరటికోళ్ల పెంపకంతో రైతులకు మంచి రాబడి వస్తుందని, దీంతో వ్యవసాయంతో పాటు మంచి ఆర్థిక స్వావలంబనను పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. గురువారం కడప నగర శివార్లలోని ఊటుకూరు కేవీకేలో పెరటికోళ్ల పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటికోళ్ల పెంపకం అనేది వ్యవసాయంతోపాటు ప్రత్యామ్నాయంగా చేసుకోవచ్చన్నారు. వీటితో కోళ్ల ఉత్పత్తిని పెంచుకుని మాంసం, గుడ్ల ద్వారా మంచి రాబడిని పొందవచ్చన్నారు. కేవీకే పశు విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి పెరటి కోళ్లకు వచ్చే ముఖ్యమైన వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. అలాగే కోళ్లకు వాడే టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం 100 కోళ్లను ఎస్సీ రైతులకు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి, మహేష్‌బాబు, మానస, గిరీష్ కుమార్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన న్యాక్ పరిశీలన



మాట్లాడుతున్న న్యాక్ పీర్ కమిటీ చైర్మన్ ఆచార్య రాజీవ్ జైన్

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల గ్రేడింగ్ కోసం నిర్వహించిన న్యాక్ పీర్ కమిటీ పర్యటన రెండోరోజు గురువారం ముగిసింది. న్యాక్ పీర్ కమిటీ చైర్‌పర్సన్ ఆచార్య రాజీవ్ జైన్, మెంబర్ కోఆర్డినేటర్ మధురేంద్రకుమార్, సభ్యులు డా. రమేష్ కుంభార్‌ల బృందం బుధ, గురువారాల్లో కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రూపొందించిన ప్రగతి నివేదికలను పరిశీలించారు. గురువారం నిర్వహించిన ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ న్యాక్ పీర్ కమిటీ ప్రతినిధుల పరిశీలన ద్వారా కళాశాలకు ఉత్తమ గ్రేడింగ్ లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. బి. రామచంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ డా. జి. వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిమ్స్ క్యాంటీన్ ప్రాంతంలో లైట్లు ఏర్పాటు



రిమ్స్ క్యాంటీన్ ప్రాంతంలో లైట్లు అమర్చడంతో కాంతివంతంగా ఉన్న దృశ్యం

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీ విభాగంలో క్యాంటీన్ ప్రాంతంలో ఈనెల 18న జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించారు. ఆ సమయంలో క్యాంటీన్ ప్రాంతంలో లైట్లు లేకపోవడంతో చీకటిగా మారింది. ఈ క్రమంలో ×రిమ్స్‌లో సమస్యల తిష్ట× కథనంలో లైట్లు లేక అంధకారంలో ఉందనే అంశంతో కూడిన కథనం ప్రచురితమైంది. గురువారం ఓపీ సమయానికి రిమ్స్ అధికారులు లైట్లు అమర్చారు. ఆ ప్రాంతం విద్యుత్ కాంతితో వెలిగింది. అక్కడికి వచ్చిన రోగులు, వారి సహాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న దీక్షలు

కడప అర్బన్: కడప కోర్టు ఎదురుగా న్యాయవాదులు చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. కడప జిల్లా కోర్టులో ఎన్‌డీపీఎస్ కోర్టును ఏర్పాటు చేయాలని, తిరుపతిలో ఏర్పాటుకు సంబంధించిన జీఓ నంబర్ 145ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ కడప నగర అధ్యక్షుడు టి.కే అఫ్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా నిర్వహిస్తున్న న్యాయవాదుల రిలే దీక్షా శిబిరాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు పఠాన్ మహమ్మద్ ఆలీఖాన్, టి.కే అఫ్జల్‌ఖాన్ సందర్శించి మద్దతు తెలిపారు. కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రఫీఖాన్, రహమతుల్లాఖాన్, హమీద్, దినకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కల్చరల్ : సమాజంలోని అనాథలను, నిస్సహాయులైన వృద్ధులను ప్రతిఫలం ఆశించకుండా అక్కున చేర్చుకుంటున్న వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి సేవలు అభినందనీయమని వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్వీ క్రిష్ణ కిషోర్ పేర్కొన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో సేవాశ్రమం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతమైన కాశినాయన మండలం ఓబుళాపురం గ్రామంలో సేవాశ్రమం ఏర్పాటు చేసి నిస్సహాయులకు, అభాగ్యులకు సేవలు అందిస్తుండడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివరామిరెడ్డి, హుస్సేన్,గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండకు కేంద్ర సాహిత్య పురస్కారం అభినందనీయం

వైవీయూ: అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమని కడప జిల్లా అరసం అధ్యక్షుడు ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. టి. సురేష్‌బాబు తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ కవిగా రచయితగా, విమర్శకుడిగా, న్యాయవాదిగా బహుముఖ కోణాల్లో సామాజిక సేవ చేశారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ జాతీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారని, ఇతర రాష్ట్రాల రచయితలకు తెలుగువారి గొప్పతనాన్ని తెలియజేశారన్నారు. భారతదేశంలో సామాజిక కల్లోలాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోనూ సాహిత్యకారులను ఏకం చేస్తూ రచనల ద్వారా జనాన్ని చైతన్య పరుస్తున్నారని తెలిపారు. పెనుగొండ రాసిన దీపిక అనే విమర్శ గ్రంథానికి పురస్కారం లభించిందని, ఆయన రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర భావి పరిశోధకులకు ఒక నమూనా గ్రంథంగా నిలుస్తుందని భవిష్యత్తులో ప్రతి జిల్లా నుండి ఇలాంటి చరిత్రలు రావడానికి ఇది ప్రేరణ ఇచ్చిందని తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వైవీయూలో ముందస్తు క్రిస్మస్ వేడుకలలో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తదితరులు

వైవీయూ: దేవుని మార్గం అనుసరణీయమని యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ , దైవ సందేశకులు బెన్నీ ప్రసాద్ కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు రఘునాథ రెడ్డి, ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటే అని చెప్పారు. దైవ సందేశకులు బెన్నీ ప్రసాద్ మాట్లాడుతూ దేవుడి మీద నమ్మకం మనల్ని ఉన్నతంగా జీవించేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట, మాధవరం-1 గ్రామాల్లో గురువారం అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని భాకరాపేట గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అక్రమ కట్టడాలను తొలగించాల్సిందిగా కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆదేశాల మేరకు పోలీసుల సహాయంతో అక్రమ కట్టడాలను తొలగించినట్లు తెలియజేశారు. మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 641/1లో భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షుమ్మ ప్రభుత్వ వంక పరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణాలను చేపట్టిందన్నారు. అలాగే మాధవరం-1 గ్రామం సర్వేనెంబర్ 864/7లో గ్రామ సచివాలయం-2 సమీపంలో వంక పరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మించారన్నారు. ఆయా నిర్మాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో భవనాలను తొలగించామని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ శ్యాంబాబు, రజనీ, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అదనపు కార్మికులకు వేతనాలు

– పలు అంశాలకు ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 437 మంది కంటింజెంట్ వర్కర్లకు జనవరి వరకూ జీతాలు ఇచ్చేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్రాసు రోడ్డులోని వైఎస్సార్ ఆడిటోరియం 12 నెలలకు లీజుకు ఇవ్వడానికి మరోసారి టెండర్ నిర్వహించాలని తీర్మాణించారు. కడప నగర పరిధిలో రాజీవ్ పార్కు, నెహ్రూపార్కు, మాచుపల్లి బస్టాండ్, ఎల్ఐసీ బస్టాప్, ఐటీఐ పార్కు, భగత్‌సింగ్ పార్కు, కోటిరెడ్డి సర్కిల్ బస్టాప్ వద్ద యూపీఐ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చారు. కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిష్డ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో కన్వేయర్ సిస్టమ్ కోసం జనరల్ ఫండ్ నుంచి రూ. 22.45లక్షలు వెచ్చించేందుకు నిర్ణయించారు. హార్టికల్చర్ విభాగంలో ప్రస్తుతం పనిచేస్తున్న 20 మంది కార్మికులను కొనసాగించేందుకు తీర్మాణించారు. నగరంలోని పాత కూరగాయల మార్కెట్, కొత్త కూరగాయల మార్కెట్, జంతు వధశాలలు, గొర్రెలు, మేకలు, ఎద్దుల వధశాల, గొర్రెలు, మేకలు, ఎద్దుల మాంసపు అంగళ్లకు సంబంధించి 33.33 శాతం పెంపుదల చే సి టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఆపరేషన్లు చేయడం ద్వారా కుక్కల సంఖ్యను నియంత్రించాలని, ఈమేరకు తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ సంస్థకు ఈ ఆపరేషన్లు చేసే టెండర్ అప్పగించాలని తీర్మాణించారు. ఈ ప్రక్రియను ప్రత్యేక కమిటీ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల్లో 15 మంది ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ వంటి కోర్సులు ఉత్తీర్ణులై సర్టిఫికెట్లు కలిగి ఉండటంతో వారికి రూ.18,500 చొప్పున వేతనం పెంచి ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, బాబు, అరీఫుల్లా బాషా, మగ్బూల్‌బాషా, బాలస్వామి రెడ్డి, ఎస్ఈ చెన్నకేశవ రెడ్డి, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, ఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఏసీపీ మునిరత్నం, ఆర్ఓలు కన్నయ్య, విజయ్‌భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

అష్ఫాఖుల్లాఖాన్ అసమాన దేశభక్తుడు



అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో అష్ఫాఖుల్లా ఖాన్‌ది ప్రత్యేక స్థానమని, ఆయన అసమాన దేశ భక్తుడని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. గురువారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఇన్సాఫ్ ఆధ్వర్యంలో అష్ఫాఖుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి , చంద్రశేఖర్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసి.బాదుల్లా, సహాయ కార్యదర్శి యస్.గౌస్, నాయకులు అబ్దుల్ ఖాదర్, హుస్సేన్, దస్తగిరి, ఖాదర్ వలీ, పక్కిరప్ప, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె. మునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో.....

ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో పండిట్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్‌ల వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రవి శంకర్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్, ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష, చాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మేకలదొడ్డిలోని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో వీరమరణం పొందిన అష్ఫాఖుల్లాఖాన్, పండిత రామ్‌ప్రసాద్ బిస్మిల్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా, సంఘ సేవకులు షేక్ చాంద్ బాషా, సలీం ఖాదర్ బాషా, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలి



న్యాయవాదులతో మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ బీనా దేవరాజ్

కడప అర్బన్: 'మధ్యవర్తిత్వం'పై అవగాహన పెంచుకోవాలని రీసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్. పద్మ అన్నారు. మధ్యవర్తిత్వంపై శిక్షణలో భాగంగా గురువారం కడపలోని జిల్లా కోర్టులో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు ఛాంబర్‌లో న్యాయమూర్తులు ఎస్. ప్రవీణ్‌కుమార్, ప్రత్యూష కుమారి, నందిని, భార్గవి తదితరులకు 'మధ్య వర్తిత్వం'పై అవగాహన, శిక్షణను ఇచ్చారు. సమస్యలను పరిష్కరించే ఓ మంచి పద్ధతిగా మధ్యవర్తిత్వం వుందని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ రీసోర్స్‌పర్సన్ బీనా దేవరాజ్ అన్నారు. మూడు రోజులుగా మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడపలోని జిల్లా కోర్టులో న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రీసోర్స్‌పర్సన్ బీనా దేవరాజ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం సమయాన్ని, ఖర్చును ఆదా చేస్తుందన్నారు. విభాగం 89 సీఆర్‌పిసి నుంచి 2023 మీడియేషన్ యాక్ట్ వరకు సెక్షన్ 6, 320 సిఆర్‌పిసి మొదలగు అంశాల వరకు వివరించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని విద్యుత్ ఉద్యోగులు సంయుక్తంగా గురువారం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జగదీష్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీఘడ్ రాష్ట్రాలలోని డిస్కంలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా చేసినట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటికరణ చేయడం వల్ల విద్యుత్ సరఫరాపై చాలా సమస్య పడుతుందని ఇలాంటి ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని సూచించారు.



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్ ను కించపరుస్తూ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు తక్షణమే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంటు వేదికగా అసహనంగా అంబేద్కర్.. అంబేద్కర్.. అనడం ఫ్యాషన్ అయిపోయిందని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

● రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను వెంటనే బర్తరఫ్ చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి చంద్రశేఖర్, రైతు సంఘం నేత ఎం.వి సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి కే సి బాదుల్లా, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఇమ్మానియేల్, కే. మునయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

అంబేద్కర్ గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కో ఆర్డినేటర్ బండి జకరయ్య, నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, కమలాపురం అసెంబ్లీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.